క్లుప్తంగా

జమ్మికుంట ప్రెస్‌క్లబ్ (ఐజేయూ) అధ్యక్షుడిగా నర్సిని శ్రీనివాస్



సన్మానిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

జమ్మికుంట: జమ్మికుంట ప్రెస్ క్లబ్ టీయూడ బ్ల్యూ(ఐజేయూ) అధ్యక్షుడిగా నర్సిని శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పట్టణంలోని ఎంపీఆర్ గార్డెన్‌లో జిల్లా అధ్యక్షుడు తాడూరి కర్ణాకర్, కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్, జాతీయ కార్యవర్గ సభ్యుడు మారుతిస్వామి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా దూలం అంజయ్య, ఉపాధ్యక్షులుగా ఒల్లాల రవీందర్‌గౌడ్, కొలకాని రాజేందర్, సదానందం, సహాయ కార్యదర్శులుగా చంద్రశేఖర్, మధుసూదన్‌రెడ్డి, వ్యవహారాల కార్యదర్శులుగా యాదగిరి, రవీందర్, కోశాధికారిగా ఎండీ అన్వర్, కార్యవర్గ సభ్యులుగా పోలంపల్లి శ్రీరామ్‌రెడ్డి, పనికరి మహేష్‌యాదవ్, కాసర్ల రవీంద్రచారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల నివేశన స్థలాలు, ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం నాయకులు యాద సతీష్, అయిత మహేష్ కార్యవర్గాన్ని గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవీందర్, సీనియర్ పాత్రికేయులు అనుమాస రాజేందర్, సంపత్, ఎదులాపురం నరేందర్, చందరాజు, ఎండీ నసీరొద్దీన్, నేరేళ్ల రఘుపతి, ఎండీ బాబా, ముంజాల సాయికుమార్, ఏబూషి శ్రీనివాస్, గణేష్, మూల తిరుపతి పాల్గొన్నారు.

తోట సమ్మయ్యకు నివాళి



సమ్మయ్య భార్యను ఓదార్చుతున్న వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి: మండలంలోని రేకొండకు చెందిన తోట సమ్మయ్య మృతదేహానికి ఆదివారం సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ సమ్మయ్య మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా, గ్రామాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందించారని గుర్తు చేశారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, తగిన న్యాయం జరిగేంత వరకు సీపీఐ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వెంట సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్, బూడిద సదాశివ, బి. యుగేందర్, మార్త ప్రకాశ్, అరిగెల సురేశ్, శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీధర్, బల్లు వెంకటమల్లు, సమ్మయ్య తదితరులున్నారు.

ఓపెన్ స్కూల్, ఇంటర్ తరగతుల పరిశీలన



తరగతులను పరిశీలిస్తున్న అధికారులు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓపెన్ టెన్త్, ఇంటర్ తరగతులను ఆదివారం స్టేట్ అబ్జర్వర్ పటేల్ గోదావరి, జిల్లా కో ఆర్డినేటర్ చల్వాజి నాగేశ్వర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వూరుకొండ సత్యప్రసాద్, పీసీపీ కో ఆర్డినేటర్ పుల్లూరి సత్యనారాయణరావు, ఉపాధ్యాయులు అరిగెల సమ్మయ్య, ఖాజా ముస్తాఖ్, రంగు దామోదరాచారి, తాళ్లపల్లి అమరేందరు ఉన్నారు.

'దళితబంధుతో మోసం'

చొప్పదండి: రాష్ట్ర ప్రభుత్వం దళిత బంధు పేరుతో మోసం చేస్తోందని, గతేడాది బడ్జెట్‌లో పథకానికి కేటాయించిన నిధులు ఒక్కరికి ఇవ్వలేదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిధులు కేటాయించి వెచ్చించ లేదని ఎద్దేవా చేశారు. తక్షణం నిధులు విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.



మానకొండూర్: ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు



చిగురుమామిడి: ఇందుర్తి గ్రామంలో...

అ'పూర్వ' సమ్మేళనం

మానకొండూర్ మండలం కొండపల్కల గ్రామంలోని ఉన్నత పాఠశాల 1980-81, చిగురుమామిడి మండలం ఇందుర్తిలోని జెడ్పీహెచ్ఎస్ 1986-87 పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమంలో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరి బాగోగులు తెలుసుకుంటూ సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. ఈసందర్భంగా విద్యనేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాల అభివృద్ధి కోసం కొండపల్కల పూర్వ విద్యార్థి మాడ వెంకటరెడ్డి రూ. 51 వేలు విరాళంగా అందజేశారు. ఇందుర్తి పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి జర్నలిస్టు గాదె రఘునాథరెడ్డిని తోటి విద్యార్థులు సత్కారించారు.

– మానకొండూర్/చిగురుమామిడి

కంటి 'వెలుగు' చూస్తున్న సమస్యలు

- రెండో విడత శిబిరాలకు విశేష స్పందన
- వృద్ధులతో సమానంగా యువతలో దృష్టి లోపాలు
- అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది
- అప్పటికప్పుడు మందులు, కళ్లద్దాలు అందజేత



పెద్దపాపయ్యపల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరానికి హాజరైన ప్రజలు

హుజూరాబాద్‌రూరల్: మండలంలో చాలా మందిలో కంటి సమస్యలు వెలుగు చూస్తున్నాయి. ప్రస్తుతం నిర్వహిస్తున్న రెండో విడత కంటి వెలుగు శిబిరాల్లో పరీక్షలు చేయించుకుంటున్న వారిలో రెటినా, డయాబెటిక్, రెటినోపతి వంటివి బయటపడుతున్నాయి. మూడు రోజులుగా నిర్వహిస్తున్న పరీక్షలకు గ్రామీణ ప్రాంతాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

అప్పటికప్పుడు అద్దాలు

పట్టణంతో పాటు గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన వారికి పరీక్షలు చేసి పలువురికి వెంటనే రీడింగ్ అద్దాలు అందిస్తున్నారు. ఉరుకుల పరుగుల జీవితం, ఒత్తిళ్లతో మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలకు కారణంగా డయాబెటిక్ రెటినోపతికి దారి తీస్తోందని వైద్యులు వెల్లడిస్తున్నారు. త్వరగా గుర్తించి జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. లేకుంటే భవిష్యత్‌లో తీవ్ర అనారోగ్యానికి గురవుతారని పేర్కొంటున్నారు.

- యువత సెల్‌ఫోన్, కంప్యూటర్లు, ట్యాబ్‌లతో ఎక్కువ సమయం గడుపుతుండటంతో నేత్ర సమస్యలు ఎక్కువ అవుతున్నాయి.
- ప్రభుత్వం 2018 ఆగస్టులో కంటి వెలుగు మొదటి విడతను ప్రారంభించింది.
- 24,362 మందికి కంటి పరీక్షలు చేశారు. 8,234 మందికి కళ్లద్దాలను అందించారు.
- జిల్లాలోని రేకుర్తి, హైదారాబాద్‌లోని కంటి ఆసుపత్రుల్లో 251 మందికి రెటీనా, ఇతర శస్త్ర చికిత్సలు చేశారు.
- శిబిరాల్లో వృద్ధులతో సమానంగా యువతలోనూ దృష్టి లోపాలు బయటపడుతున్నాయి.
- సామాజిక మధ్యమాల్లో లీనమవ్వడం, అస్తమానం సెల్‌ఫోన్, కంప్యూటర్ వెలుతురుతో కళ్లు ఆలసటకు గురవుతున్నాయి. వీటిని పట్టించుకోక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ఇప్పుడు కంటివెలుగు శిబిరాల్లో తేట తెల్లమవుతున్నాయి.

అవగాహన కల్పిస్తున్నాం

రెండో విడత కంటి వెలుగు శిబిరంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. శిబిరంలో సౌకర్యాలు వివరిస్తున్నాం, శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి చేరువయ్యేలా విధులు నిర్వహిస్తున్నాం.

– తాడూరి లత, ఆశా వర్కర్, కాట్రపల్లి

సద్వినియోగం చేసుకోవాలి

గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు శిబిరాలను 18 ఏళ్లు నిండినవారు వినియోగించుకోవాలి. కంటి పరీక్షలు చేసి అద్దాలు, మందులు అందజేస్తున్నాం. కంటి సమస్యలున్నవారు శిబిరాలకు హాజరై సమస్య తీవ్రం కాకుండా కళ్లను కాపాడుకోవాలి.

– మధుకర్, వైద్యాధికారి, చెల్పూర్ పీహెచ్‌సీ

రైతుల సంక్షేమానికి కృషి చేయాలి



పుష్పగుచ్ఛం ఇస్తున్న మార్కెట్ కమిటీ పాలకవర్గం

చిగురుమామిడి: హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌ను మండలంలోని సుందరగిరి, ఉల్లంపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడబోయిన రజినితిరుపతిరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ రామోజు రజితకృష్ణమాచారి, డైరెక్టర్ కొత్త కైలాసం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం రైతుల సంక్షేమం కోసం కృషిచేయాలని కోరారు.

26 ట్రాక్టర్, బైక్ ర్యాలీ

జమ్మికుంట: దేశ వ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 26న జిల్లా కేంద్రంలో నిర్వహించే ట్రాక్టర్, బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని జిల్లా రైతు కమిటీ సభ్యుడు చెల్పూరి రాములు పిలుపు నిచ్చారు. ఆదివారం పట్టణంలోని రైతు సంఘం భవనంలో మాట్లాడారు. రైతులు పండించిన పంటకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి రైతులకు మద్దతు ధర అందించాలని డిమాండ్ చేశారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



బహుమతి అందిస్తున్న ఎంపీపీ కొత్త వినీత

చిగురుమామిడి: గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని ఎంపీపీ కొత్త వినీత అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీపీఎల్–2 ఫైనల్ మ్యాచ్‌కు హాజరయ్యారు. ఫైనల్ మ్యాచ్‌లో బొమ్మనపల్లి, రేకొండ జట్లు తలపడ్డాయి. విజేత రేకొండ జట్టుకు ఎంపీపీ రూ.15వేలు, రన్నర్‌గా నిలిచిన బొమ్మనపల్లి జట్టుకు రూ.7,000వేల నగదు, బహుమతులు అందించారు. అనంతరం క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. ఆటల్లో గెలుపోటములు సహజమని, ఓటమి గెలుపు సూచికలన్నారు. కార్యక్రమంలో చిగురుమామిడి ఎస్సై దాస సుధాకర్, చిగురుమామిడి సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకట్రమణారెడ్డి, ఎంపీటీసీ మల్లేశం, ఆర్గనైజర్లు నరేందర్‌రెడ్డి, సన్నీరెడ్డి, సాగర్‌రెడ్డి, లడ్డు, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన యువజన క్రీడోత్సవ పోటీలు



క్రీడాకారులకు బహుమతులందిస్తున్న ఎంఈవో

హుజూరాబాద్: పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో నెహ్రూ యువకేంద్రం కరీంనగర్ ఆధ్వర్యంలో యువశక్తి యూత్ అసోసియేషన్ రాజాపల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన క్రీడోత్సవాలు ఆదివారం ముగిశాయి. కార్యక్రమానికి ఎంఈవో వెంకట నరసింహారెడ్డి హాజరై బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్ కబడ్డీ, వాలీబాల్, పరుగు పందెం పోటీల్లోని విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని, ఆటల్లో గెలుపోటములు సహజమని, వాటిని సమానంగా స్వీకరిస్తూ ముందుకు వెళ్లాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ సారయ్య, మండల హాకీ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, యువశక్తి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మునిగాల అశోక్, హాకీ క్లబ్ మండల ప్రెసిడెంట్ శ్రీనివాస్, క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి



మాట్లాడుతున్న వడ్లూరి వాసు

హుజూరాబాద్: రాష్ట్రంలో పనిచేస్తున్న మహిళ ఐఏఎస్ అధికారులకు పూర్తి స్థాయిలో ప్రభుత్వం రక్షణ కల్పించాలని జేడీఎస్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి వాసు అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఓ సీనియర్ మహిళ ఐఏఎస్ అధికారి ఇంట్లోకి అనుమతి లేకుండా ప్రవేశించి భయాందోళనకు గురి చేయటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఐఏఎస్ అధికారి పరిస్థితి ఇలా ఉంటే సాధారణ మహిళల పరిస్థితి ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు వెంకన్న, సమ్మయ్య,రాజేందర్, వెంకటేష్ ముదిరాజ్, రుద్రరపు సురేష్, బండారి శ్రీనివాస్, బత్తుల సురేష్ తదితరులు ఉన్నారు.

నియామకం



సైదాపూర్: బీజేపీ మండల కమిటీ ఉపాధ్యక్షుడిగా సైదాపూర్‌కు చెందిన మునిగంటి సంతోష్‌ను నియమించినట్లు మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ప్రటించారు. పార్టీ పటిష్టతకు చురుకుగా కృషి చేస్తున్న సంతోష్‌ను పార్టీ గుర్తించి, మండల కమిటీలో ఉపాధ్యక్ష పదవి కేటాయించిందని తెలిపారు. నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ అధ్యక్షుడు బొమ్మా శ్రీరాంచక్రవర్తిలకు సంతోష్ కృతజ్ఞతలు తెలిపారు.

శక్తి కేంద్రాల సమావేశం

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో ఆదివారం బీజేపి శక్తి కేంద్రాల సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతానికి శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు పని చేయాలని మానకొండూర్ అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి సూచించారు. బూత్‌స్థాయి నుంచి పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్, గడ్డం నాగరాజు, వెంకట్ రెడ్డి, కొంరయ్య, శ్రీనివాస్, నరేశ్, సాగర్, సారయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ యువజన సంఘం ధర్మారం గ్రామ కమిటీ



నూతన కమిటీకి నియామకపత్రం అందజేత

శంకరపట్నం: ఆల్‌ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ధర్మారం గ్రామకమిటీని ఆదివారం నియమించామని జిల్లా ప్రధాన కార్యదర్శి గరిగే ప్రభాకర్ తెలిపారు. అధ్యక్షుడిగా దేవునూరి అశోక్, గౌరవ అధ్యక్షుడిగా బూర్గుల సదయ్య, ఉపాధ్యక్షులు రాజు, కిరణ్, ప్రధాన కార్యదర్శిగా అనిల్, ఇతరులను ఎన్నుకున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అర్జున్, కుమారస్వామి, సదానందం, ఉపసర్పంచ్ సదానందం పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా సీఎంఆర్ఎఫ్

ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: నియోజకవర్గంలో ఈ నెల 31 జరిగే మంత్రి కేటీఆర్ పర్యటన విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అనంతరం జమ్మికుంట పట్టణంలో మంత్రి కేటీఆర్ సభ నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలన్నారు. అనంతరం పట్టణ, మండలానికి చెందిన 28 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. అభాగ్యులకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తోందన్నారు. అనంతరం 30వ వార్డులో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక, వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, ఎంపీపీ ఇరుమల్ల రాణి, జెడ్పీటీసీ సభ్యుడు బక్కారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఎడవల్లి కొండల్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, మండల అధ్యక్షుడు ఐలయ్య కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

రాజీవ్ రహదారిపై డివైడర్ల పరిశీలన



డివైడర్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, సీఐ, ఎస్సైలు

తిమ్మాపూర్: మండలంలోని ఎల్ఎండీ కాలనీ ఎస్సారెస్పీ కార్యాలయం వద్ద రాజీవ్ రహదారిపై గతంలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరిగేవి. దీంతో హెచ్‌కేఆర్ సంస్థ డివైడర్ మధ్యలో సిమెంటు దిమ్మెలతో తాత్కాలికంగా అడ్డుగోడ ఏర్పాటు చేసింది. మూడేళ్ల క్రితం ఎల్ఎండీ కాలనీలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నిర్మించారు. కార్యాలయానికి వెళ్లడానికి ఎమ్మెల్యేతోపాటు, వివిధ పనుల నిమిత్తం కార్యాయానికి వచ్చేవారు రాంగ్ రూట్‌లో వెళ్లేవారు. లేదంటే రెండు కిలోమీటర్లు దూరం ప్రయాణించాల్సి వచ్చేంది. రాంగ్ రూట్ ప్రయాణంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించిన ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ క్యాంపు కార్యాలయం సమీపంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలను ఎమర్జెన్సీ టైంలో తొలగించాలని సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ ప్రమోద్‌రెడ్డికి సూచించారు. క్యాంపు కార్యాలయంలోకి వెళ్లే వీఐపీ వాహనాల కోసం తాత్కాలికంగా స్టాపర్ ఏర్పాటు చేస్తామని సీఐ, ఎస్ఐ తెలిపారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

హుజూరాబాద్‌రూరల్: పంట మార్పిడి చేయకపోవడంతోపాటు వరికొయ్యలు సరిగ్గా మురగకపోవడంతో వర్షాకాలంలో గమనించిన మొగిపురుగు ప్రస్తుత యాసంగి వరి పంటకు నష్టం కలిగిస్తోందని, ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగుచేయడంతో పురుగు ఉధృతి పెరిగిందని, రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ సునీత సూచించారు. నివారణకు పిచికారీ చేయాల్సిన మందులు వివరించారు.

వైభవంగా శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



పూజల్లో మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, తదితరులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంటలో పురాతన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయం పునర్నిర్మాణంలో భాగంగా ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో శ్రీ విఘ్నేశ్వరపూజ, పుణ్యాహ వచనం, పంచాగవ్యప్రాశన, రక్షా బంధనం, ఋత్విక్ వర్ణన యజ్ఞశాల ప్రవేశం, అఖండజ్యోతి ప్రజ్వలన, దేవతా ఆహ్వానం, యాగశాల సంస్కారం, మండప దేవతా సహిత నవగ్రహ వాస్తు యోగిని, క్షేత్ర పాలక, అగ్ని ప్రతిష్ఠాపన, స్థాపిత దేవతా మూల మంత్ర హోవనములు, జలాదివాసం, హారతి మంత్రపుష్పములు, చతుర్థ సేవలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపెల్లి రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్లు దయ్యాల శ్రీనివాస్, భోగం సుగుణ, ఆలయ అభివృద్ధి కార్యనిర్వాహక కార్యదర్శి ఆకుల రాజేందర్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



గంగాధర: గంగాధర ప్రెస్ క్లబ్ క్యాలెండర్‌ను ఆదివారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి పత్రికలు వారధిగా నిలుస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు రాజమౌళి, కార్యదర్శి రాజిరెడ్డితో పాటు శ్రీరాం రవీందర్, ముచ్చ రవి, మధుసూదన్ రెడ్డి, మేడి ప్రసాద్, వీర నరసయ్య, రాజేశం, వేణుగోపాల్, శ్రీనివాస్ తదితరులున్నారు.